క్లుప్తంగా

కట్టిజనుముతో నేల సారవంతం



రేగిడిలో సాగు చేస్తున్న కట్టిజనుము

రేగిడి: పొలాల్లో కట్టిజనుము సాగుతో నేల సారవంతమవుతుందని ఏవో పి.మురళీకృష్ణ తెలిపారు. ఖరీఫ్ సాగుకు ముందు కట్టిజనుము విత్తనాలు వేసుకుని, మొక్కలైన తర్వాత వాటిని అదే నేలలో కలియదున్ని, మూడురోజుల పాటు నీటిలో నానబెట్టాలన్నారు. ఆ తర్వాత దుక్కి పనులు చేసి, వరి విత్తనాలు వేసుకుంటే మంచి దిగుబడులు వస్తాయన్నారు. పంటకు అవసరమైన పోషకాలు నేల నుంచే అందుతాయన్నారు. మండలంలోని చాలాచోట్ల కట్టిజనుము సాగు చేస్తున్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

బొబ్బిలి రూరల్: మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం శనివారం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో పి.రవికుమార్ ఓ ప్రకటనలో శుక్రవారం తెలిపారు. ఎంపీపీ శంబంగి లక్ష్మి అధ్యక్షతన ఉదయం 10.30 గంటలకు జరిగే ఈ సమావేశానికి ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, ఇతర ప్రజాప్రతినిధులు హాజరవుతారని, పూర్తిస్థాయి సమాచారంతో అధికారులు కూడా హాజరుకావాలన్నారు.

పక్కాగా సోషల్ ఆడిట్



ఉపాధి పనులపై ఆడిట్ నిర్వహిస్తున్న డీఆర్‌పీలు

వంగర: మండలంలోని అన్ని గ్రామాల్లో ఉపాధి హామీ పథకం పనులకు సంబంధించి, సోషల్ ఆడిట్ పక్కాగా జరుగుతోంది. 8 మంది డీఆర్‌పీలు బృందాలుగా ఏర్పడి, గ్రామాల్లో తిరుగాడుతూ ఏడాది కాలంగా జరిగిన పనుల నిర్వహణపై ఆడిట్ చేస్తున్నారు. ఆడిట్ అనంతరం మండల స్థాయిలో జూలై 4వ తేదీన ప్రజావేదిక ఉంటుందని ఏపీవో సత్యవతి తెలిపారు.

'నేను బడికి పోతా' ర్యాలీ



ర్యాలీలో ఎంఈవో దుర్గారావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు

వంగర: మండలంలోని అరసాడ గ్రామంలో నేను బడికి పోతా కార్యక్రమం ర్యాలీ శుక్రవారం నిర్వహించారు. మనఊరు బడి–భవితకు గుడి, పెద్దలు పనికి–పిల్లలు బడికి అని ఉపాధ్యాయులు, విద్యార్థులు నినాదాలు చేశారు. ఎంఈవో వై.దుర్గారావు మాట్లాడుతూ బడిఈడు పిల్లలందరినీ ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని తల్లిదండ్రులను కోరారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు కె.జగదీశ్వరి తదితరులు పాల్గొన్నారు.

చురుగ్గా పారిశుధ్య పనులు



పెంట గ్రామంలో రోడ్డు పక్కన ఉన్న పిచ్చి మొక్కలను తొలగిస్తున్న సిబ్బంది

బొబ్బిలి రూరల్: మండలంలోని పెంట, రంగరాయపురం, దిబ్బగుడ్డివలస గ్రామాల్లో పారిశుధ్య పనులు చాలా చురుగ్గా జరుగుతున్నాయి. ప్రధాన రోడ్లలోని చెత్తాచెదారం ఏరివేయడంతో పాటు కాలువల్లో మురుగు, పూడికలు తొలగిస్తున్నారు. అనంతరం బ్లీచింగ్ చల్లుతున్నారు. రక్షిత మంచినీటి పథకాలు, తాగునీటి బోర్లు, బోరుబావుల్లో క్లోరినేషన్ చర్యలు చేపడుతున్నారు. అలాగే దోమల నివారణ మందు పిచికారీ చేయిస్తున్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు



కొత్త ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేస్తున్న సిబ్బంది

రాజాం: పట్టణానికి తాగునీటిని అందించే పంపుహౌస్ వద్ద కొత్తగా ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసినట్లు మున్సిపల్ ఏఈ వెంకట్ తెలిపారు. రేగిడి మండలంలోని సంకిలి నాగావళి నది వద్ద ఉన్న పంపుహౌస్ దగ్గర ఈ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. దీంతో తాగునీటిని సరఫరా చేసే సమయంలో ఉండే లోవోల్టేజీ విద్యుత్ సమస్యలు తగ్గుతాయన్నారు.

రుచికరమైన భోజనం అందించాలి

- మధ్యాహ్న భోజనం తనిఖీ చేసిన ఎంఈవోలు
- నాణ్యత లోపిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరిక

రామభద్రపురం: ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనం వంటకాలు రుచికరంగా ఉండేలా చూడాలని ఎంఈవో తిరుమల ప్రసాద్ సూచించారు. మండలంలోని పలు గ్రామాల పాఠశాలలను శుక్రవారం సందర్శించిన ఆయన అక్కడి విద్యార్థుల కోసం సిద్ధం చేసిన మధ్యాహ్న భోజనం వంటకాలను రుచి చూసి పరిశీలించారు. ప్రతిరోజూ మెనూ ప్రకారం భోజనాలు వండిపెట్టాలని, వేడివేడిగా ఉన్నప్పుడే విద్యార్థులు వడ్డించాలని సిబ్బందికి తెలిపారు. మధ్యాహ్న భోజనం నిర్వహణ బాధ్యతను రోజుకో ఉపాధ్యాయుడు చూసుకోవాలన్నారు. భోజనం నాణ్యతలో తేడావస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. వంటగది, పాత్రలు పరిశుభ్రంగా ఉండేలా చూడాలన్నారు.



తెర్లాం: జగన్నాథవలసలో మధ్యాహ్న భోజనం వంటకాలు పరిశీలిస్తున్న ఎంఈవో త్రినాథరావు



రామభద్రపురం: ఇట్లామామిడిపల్లిలో మధ్యాహ్న భోజనం రుచి చూస్తున్న ఎంఈవో తిరుమలప్రసాద్



రేగిడి: ఆమదాలవలస కాలనీ పాఠశాలలో వంటకాలు రుచి చూసి, పరిశీలిస్తున్న ఎంఈవో ఎరకయ్య



రాజాం: కంచరాం పాఠశాలలో మధ్యాహ్న భోజనం తనిఖీ చేస్తున్న ఎంఈవో ప్రవీన్‌కుమార్

తెర్లాం: విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనంలో నాణ్యత లోపిస్తే చర్యలు తప్పవని మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులకు ఎంఈవో జె.త్రినాథరావు హెచ్చరించారు. మండలంలోని జగన్నాథవలస గ్రామ ప్రాథమిక పాఠశాలను శుక్రవారం సందర్శించిన ఆయన అక్కడి విద్యార్థుల కోసం సిద్ధం చేసిన మధ్యాహ్న భోజనం వంటకాలను పరిశీలించి, పలు సూచనలు చేశారు. వంటకాలు రుచి, శుచి కలిగి ఉండాలని, ప్రతీ విద్యార్థికి భోజనం అందేలా చూడాలన్నారు. అంతకుముందు తరగతుల వారీగా విద్యార్థుల వద్దకు వెళ్లి, వివిధ ప్రశ్నల ద్వారా వారి అభ్యసనా సామర్థ్యాలను పరీక్షించారు. అలాగే విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు, పాఠశాల రికార్డులు తనిఖీ చేశారు. మరుగుదొడ్ల నిర్వహణ, తాగునీటి సదుపాయం సక్రమంగా అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. బడిఈడు పిల్లలను గుర్తించి, బడిలో చేర్పించాలని సూచించారు. విద్యార్థులకు చదువుపై ఆసక్తి కలిగించేలా విద్యాబోధన చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు.

రేగిడి: మండలంలోని ఆమదాలవలస కాలనీలో ఉన్న ప్రభుత్వ పాఠశాలను ఎంఈవో–2 బి.ఎరకయ్య శుక్రవారం సందర్శించి, అక్కడి విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు, పాఠశాల రికార్డులు, విద్యార్థుల కోసం సిద్ధం చేసిన మధ్యాహ్న భోజనం వంటకాలను పరిశీలించారు. అనంతరం సిబ్బందికి పలు సూచనలు చేశారు. పిల్లలకు అందించే భోజనం మన ఇంట్లో తయారు చేసుకునే మాదిరిగా ఉండాలని, ఆ దిశగా చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయులకు సూచించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు పి.రమేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రాజాం: మండలంలోని కంచరాం గ్రామ ప్రభుత్వ పాఠశాలను ఎంఈవో బి.ప్రవీన్‌కుమార్ శుక్రవారం సందర్శించి, అక్కడి ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు, పాఠశాల రికార్డులు పరిశీలించారు. అనంతరం విద్యార్థుల కోసం సిద్ధం చేసిన మధ్యాహ్న భోజనం వంటకాలను రుచి, చూశారు. మెనూ ప్రకారం వంటకాలు వండిపెట్టాలని, ఇంటి దగ్గర ఎలా వండుతామో అలాగే ఇక్కడ కూడా వండిపెట్టాలని సిబ్బందికి సూచించారు. విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడి, పిల్లలను ప్రభుత్వ పాఠశాలలకే పంపించేలా ఉపాధ్యాయులు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు వసంతరావు తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల షాపుల్లో ఆకస్మిక తనిఖీలు

బాడంగి: మండలంలోని పలు ఎరువుల షాపుల్లో ఏవో కె.శిరీష శుక్రవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ప్రభుత్వం నిర్దేశించిన ధరలకే ఎరువులు, పురుగుమందులు, విత్తనాలు విక్రయించాలని, అధిక ధరలకు విక్రయించినట్లు తెలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు. నాణ్యమైన విత్తనాలు, ఎరువులు మాత్రమే విక్రయించాలని, రైతుల నుంచి ఎటువంటి ఫిర్యాదులు అందినా షాపు యజమానులపై చర్యలకు వెనుకాడమన్నారు. స్టాక్ రిజిస్టర్, విక్రయాల రిజిస్టర్, లైసెన్స్ తప్పనిసరిగా ఉండాలన్నారు. స్టాక్‌బోర్డు, ధరల పట్టికను షాపు బయట ఉంచాలన్నారు. అనంతరం వరి, మొక్కజొన్న విత్తనాల నాణ్యతను పరీక్షించేందుకు విజయనగరంలోని ల్యాబ్‌కు విత్తనాలు తరలించారు. ఆమె వెంట ఏఈవో పుష్పలత తదితరులు పాల్గొన్నారు.



ఎరువుల షాపులో తనిఖీలు నిర్వహిస్తున్న ఏవో శిరీష

వినతిపత్రం అందజేత

రేగిడి: రైతుల సమస్యలను ఈ ఖరీఫ్ సీజన్‌లోనే పరిష్కరించాలని ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు నారు జనార్దనరావు డిమాండ్ చేశారు. ఇదే విషయమై ఆయన మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయానికి శుక్రవారం వెళ్లి, తహసీల్దార్ రాములమ్మకు రైతుల సమస్యలు–వివిధ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రకటించిన సాగుసాయం ఇప్పుడే అందివ్వాలని, కౌలురైతులకు గుర్తింపుకార్డులతో పాటు రూ.5 లక్షల వరకు పావలా వడ్డీకే రుణాలు ఇవ్వాలని కోరారు. అలాగే సాగునీటి కాలువల మరమ్మతులు చేపట్టి, ఖరీఫ్‌కు సాగునీరు అందేలా చూడాలన్నారు. ప్రకృతి వ్యవసాయంలో గౌరవ వేతనం పొందే కార్యకర్తల వేతనబకాయిలు వెంటనే చెల్లించాలన్నారు. స్పందించిన తహసీల్దార్.. కలెక్టర్ దృష్టికి ఈ సమస్యలు తీసుకువెళ్లి, పరిష్కారమయ్యేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు.



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు జనార్దనరావు

పుష్పాలంకరణలో పైడితల్లి దర్శనం



రాజాం సిటీ: స్థానిక బొబ్బిలి రోడ్డులోని పోలిపల్లి పైడితల్లి అమ్మవారు శుక్రవారం పుష్పాలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఓ భక్తుడు ఈ పూలదండలను సమర్పించారని, వాటితో అమ్మవారిని అలంకరించామని అర్చకులు వేమకోటి సూర్యనారాయణశర్మ తెలిపారు.

రారవే సమావేశం రేపు

రాజాం సిటీ: స్థానిక విద్యానికేతన్ స్కూల్‌లో ఈ నెల 30వ తేదీన రాజాం రచయితల వేదిక(రారవే) సమావేశం నిర్వహించనున్నామని వేదిక నిర్వాహకులు గార రంగనాథం ఓ ప్రకటనలో శుక్రవారం తెలిపారు. డాక్టర్ ఆల్తి మోహనరావు అధ్యక్షతన జరగనున్న ఈ సమావేశంలో ప్రముఖ సాహితీవేత్త, కవి, రచయిత నేతేటి గణేశ్వరరావు పాల్గొని 'శ్రీనాథ సాహిత్య విహంగ వీక్షణం' అనే అంశంపై ప్రసంగించనున్నారన్నారు. ఉదయం 9 గంటలకు జరగనున్న ఈ కార్యక్రమానికి కవులు, రచయితలు, భాషాభిమానులు, సాహిత్యాభిమానులు హాజరుకావాలని ఆయన కోరారు.

నిషేధిత పాలిథిన్ సంచులు విక్రయిస్తే చర్యలు

బొబ్బిలి: నిషేధిత పాలిథిన్ సంచులు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ రామలక్ష్మి హెచ్చరించారు. మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ శివతో కలిసి మున్సిపాలిటీ పరిధిలోని పలు దుకాణాల్లో శుక్రవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించిన ఆమె.. నిషేధిత ప్లాస్టిక్ గ్లాసులు, ప్లేట్లు, పాలిథిన్ సంచులు గుర్తించి, వాటిని సీజ్ చేశారు. అనంతరం వాటిని విక్రయిస్తున్న దుకాణదారులకు అపరాధ రుసుం విధించారు. మరోసారి పాలిథిన్ సంచులు విక్రయాలు చేపట్టినట్లు తమ దృష్టికి వస్తే సహించేది లేదన్నారు.

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు

సంతకవిటి: గ్రామీణ ప్రాంతాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో జి.పైడితల్లి సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వైద్య, రెవెన్యూ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులతో శుక్రవారం సమావేశమైన ఆమె.. ప్రజారోగ్యమే లక్ష్యంగా అన్ని శాఖల సమన్వయంతో పనిచేయాలన్నారు. గ్రామాల్లో పారిశుధ్య పనులు ముమ్మరం చేయాలని, తాగునీటి వనరుల్లో క్లోరినేషన్ చర్యలు చేపట్టాలన్నారు. ఎక్కడా మురుగునీరు నిలువ ఉండకుండా చూసుకోవాలన్నారు. కాచివడపోసిన నీటినే తాగాలన్నారు. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత కూడా పాటించాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ తిరుమలరావు, సంతకవిటి పీహెచ్‌సీ వైద్యాధికారి యు.నాగేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

బొబ్బిలి: స్థానిక ప్రభుత్వ ఐటీఐలో చేరేందుకు ఆసక్తి కలిగిన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ప్రిన్సిపాల్ జి.వి.రమణారావు ఓ ప్రకటనలో శుక్రవారం వెల్లడించారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఈ నెల 29 నుంచి జూలై 27వ తేదీ వరకు దరఖాస్తు చేసుకునేందుకు గడువు అన్నారు. ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, టర్నర్, మెషినిస్ట్, మోటార్ మెకానిక్, డీజిల్ మెకానిక్, వెల్డర్ ట్రేడ్‌లలో సీట్లు ఖాళీగా ఉన్నాయన్నారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు జూలై 24వ తేదీలోగా జిల్లాలోని ఏదైనా ప్రభుత్వ ఐటీఐలో సర్టిఫికెట్లు వెరిఫికేషన్ చేయించుకోవాలన్నారు. అనంతరం జూలై 27వ తేదీన ఉదయం 8 గంటలకు ఐటీఐలో జరిగే కౌన్సెలింగ్‌కు అన్ని ధ్రువపత్రాలతో హాజరుకావాలన్నారు. మరిన్ని వివరాలకు ప్రభుత్వ ఐటీఐని సంప్రదించాలన్నారు.

వాహన తనిఖీలు

తెర్లాం: వాహనదారులు తప్పనిసరిగా తమ వాహనాలకు సంబంధించిన ధ్రువీకరణ పత్రాలతో పాటు, డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని తెర్లాం ఏఎస్ఐ మల్లేశ్వరరావు తెలిపారు. స్థానిక పోలీస్‌స్టేషన్ వద్ద వాహన తనిఖీలు శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆటోలు నడిపేవారు తప్పనిసరిగా యూనిఫాం ధరించాలని, ద్విచక్ర వాహనాలు నడిపేవారు హెల్మెట్ ధరించాలని, అలాగే వాహనాలకు సంబంధించిన పత్రాలు తప్పనిసరిగా కలిగి ఉండాలన్నారు. ఏ విధమైన ధ్రువీకరణ పత్రం లేకపోయినా, డ్రైవింగ్ లైసెన్స్ లేకపోయినా అపరాధ రుసుం విధించడం జరుగుతుందన్నారు.



తెర్లాంలో వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులు

చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి

తెర్లాం: చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలకు బాడంగి ఐసీడీఎస్ పీవో కె.రాజ్యలక్ష్మి సూచించారు. స్థానిక వెలుగు కార్యాలయంలో ఎర్లీ చైల్డ్ డెవలప్‌మెంట్(ఈసీడీ)పై శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఆమె మాట్లాడుతూ ఐదేళ్లలోపు పిల్లల్లో శారీరక, మానసిక ఎదుగుదలకు ఎక్కువగా అవకాశం ఉంటుందని, అంగన్‌వాడీ కేంద్రాల్లోని ప్రీస్కూల్ పిల్లలకు నేర్పించే విషయాలు వారికి బాగా గుర్తుండిపోతాయన్నారు. గృహ సందర్శనకు వెళ్లినప్పుడు పిల్లల ఆరోగ్య, మానసిక స్థితిగతులను తెలుసుకోవాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పంపిణీ చేస్తున్న పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందన్నారు.

ఆందోళన

బొబ్బిలి: ఐపీసీ చట్టానికి బదులు కేంద్రం జూలై నుంచి అమలు చేయనున్న బీఎన్ఎస్ చట్టం డ్రైవర్ల పాలిట ఉరితాడు వంటిదని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు పొట్నూరు శంకరరావు అభిప్రాయపడ్డారు. స్థానిక చర్చి సెంటర్‌లో ఆ చట్టానికి వ్యతిరేకంగా శుక్రవారం ఆందోళన చేపట్టారు. ఆయన మాట్లాడుతూ కేంద్రం అమలు చేయనున్న బీఎన్ఎస్ చట్టంలోని 106–1, 106–2 అధికరణాల వల్ల రోడ్డు ప్రమాదాల్లో ఎవరైనా మరణించినా డ్రైవర్ తప్పులేకపోయినా కేసు నమోదైతే చాలు మూడు నుంచి ఏడేళ్ల వరకు జైలుశిక్ష పడే పరిస్థితులుంటాయన్నారు. చట్టానికి వ్యతిరేకంగా జూలై 1న తహసీల్దార్ కార్యాలయాల వద్ద ధర్నాలు చేయనున్నామన్నారు.

సీజనల్ వ్యాధుల కట్టడికి ముందస్తు చర్యలు

రామభద్రపురం: ప్రజారోగ్య పరిరక్షణే లక్ష్యంగా సీజనల్ వ్యాధుల కట్టడికి ముందస్తు చర్యలు చేపడుతున్నామని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారులు దిలీప్‌కుమార్, శిరీష తెలిపారు. స్థానిక పీహెచ్‌సీలో ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలతో శుక్రవారం సమావేశమైన వారు మాట్లాడుతూ వర్షాకాలంలో మలేరియా, డెంగీ, టైఫాయిడ్, అతిసారం వంటి సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని, ఈ నేపథ్యంలో ఆయా వ్యాధుల నివారణ చర్యలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు.

ప్రజలను చైతన్యం చేసి, వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించేలా చూడాలన్నారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాల కారణంగా గుంతలు, రోడ్ల పక్కన నిల్వ ఉండిపోతున్న మురుగునీటిలో దోమలు పెరిగే అవకాశం ఉందని, తద్వారా మలేరియా, డెంగీ జ్వరాలు వ్యాప్తి చెందుతాయన్నారు. పంచాయతీ అధికారులతో కలిసి గ్రామాల్లో వ్యాధులు వ్యాప్తి చెందకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై గ్రామస్తులకు అవగాహన కల్పించాలన్నారు.



మాట్లాడుతున్న పీహెచ్‌సీ వైద్యాధికారులు దిలీప్‌కుమార్, శిరీష

బీజామృతంతో విత్తనశుద్ధి మేలు

రేగిడి: బీజామృతంతో విత్తనాలు శుద్ధి చేసుకోవడం మేలు అని ప్రకృతి వ్యవసాయం ఐసీఆర్‌పీలు పి.తవిటినాయుడు, కె.రమణ అన్నారు. మండలంలోని వన్నలి, చాటాయివలస గ్రామాల్లో విత్తనశుద్ధిపై రైతులకు శుక్రవారం అవగాహన కల్పించారు. ఖరీఫ్ సాగుకు ముందు వరి విత్తనాలను బీజామృతంతో శుద్ధి చేసుకుంటే వరినారు తెగుళ్ల బారినపడకుండా ఉంటుందన్నారు. ఆరోగ్యవంతమైన నారు నాటుకోవడం ద్వారా ఆరోగ్యవంతమైన పంట, అధిక దిగుబడులు వస్తాయన్నారు.

బొబ్బిలి రూరల్: మండలంలోని అలజంగి గ్రామంలో ఉన్న రైతు భరోసా కేంద్రం వద్ద విత్తనశుద్ధిపై రైతులకు అవగాహన కల్పించారు. వీఏఏ లత మాట్లాడుతూ వరిపంట సాగుకు ముందు విత్తనాలను సూడోమోనాస్ పౌడర్‌తో శుద్ధి చేసుకోవడం ద్వారా వరినారుకు ఎటువంటి తెగులు, చీడపీడలు పట్టవన్నారు. ఆరోగ్యవంతమైన నారు పొలాల్లో నాటుకుంటే ఆరోగ్యవంతమైన పంట, అధిక దిగుబడులు వస్తాయని తెలిపారు.



వన్నలిలో విత్తనశుద్ధిపై అవగాహన కల్పిస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

తోటవలసలో డీపీవో పర్యటన

మెంటాడ: మండలంలోని లోతుగెడ్డ గ్రామ పంచాయతీ పరిధిలోని తోటవలసలో డీపీవో(జిల్లా పంచాయతీ అధికారి) శ్రీధర్‌రాజు శుక్రవారం పర్యటించారు. గ్రామంలో మలేరియా జ్వరపీడితులు ఉన్నారన్న సమాచారంతో అక్కడికి వెళ్లిన ఆయన గ్రామంలోని పారిశుధ్య చర్యలు, తాగునీటి ట్యాంకుల్లో పరిశుభ్రతా చర్యలను చూసి, సంతృప్తి వ్యక్తం చేశారు. వర్షాకాలం నేపథ్యంలో మలేరియా, డెంగీ, టైఫాయిడ్, అతిసారం వంటి సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, వాటి బారినపడకుండా జాగ్రత్త వహించాలని సూచించారు. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత కూడా పాటించాలని గ్రామస్తులకు తెలిపారు. కార్యక్రమంలో మండల విస్తరణ అధికారి విమలకుమారి, సర్పంచ్ భీమారావు, పంచాయతీ కార్యదర్శి బి.పద్మ తదితరులు పాల్గొన్నారు.

మలేరియాను అరికడదాం

రాజాం సిటీ: ప్రతి ఒక్కరూ మలేరియాను అరికట్టడంలో భాగస్వాములు కావాలని, అందుకు తమ ఇళ్ల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని పొగిరి పీహెచ్‌సీ వైద్యాధికారిణి గట్టి భార్గవి తెలిపారు. పొగిరి పీహెచ్‌సీ పరిధిలో మలేరియా వ్యతిరేక మాసోత్సవ ర్యాలీ శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా వ్యవహరించాలని, దోమలు వృద్ధి చెందకుండా నీటినిల్వలు లేకుండా చూడాల్సిన బాధ్యత ఉందన్నారు. చెత్తాచెదారాలు కాలువల్లో వేయకుండా వీధిలోకి వచ్చిన పారిశుధ్య కార్మికులకు అందజేయాలన్నారు. జ్వర లక్షణాలు కనిపిస్తే వెంటనే ఆస్పత్రికి వెళ్లి, వైద్యుల సలహాలు తీసుకోవాలన్నారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల దృష్ట్యా నిల్వ ఉంచిన మాంసం, చేపలు వంటివి తినకూడదన్నారు. వేడి నీటినే తాగాలన్నారు. అనంతరం గ్రామంలో చేపడుతున్న ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. కార్యక్రమంలో ఫీల్డ్ ఆఫీసర్ అల్లాడ నాగభూషణరావు, వైద్యారోగ్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



మలేరియాను అరికడదామని నినాదాలు చేస్తున్న వైద్యారోగ్య సిబ్బంది

ఉద్యానవనాల పెంపకానికి ప్రోత్సాహం

బాడంగి: ఉపాధి హామీ పథకం ద్వారా ఉద్యానవనాల పెంపకానికి ప్రోత్సహిస్తున్నట్లు ఏపీవో విజయలక్ష్మి శుక్రవారం తెలిపారు. మండలంలోని ముగడ, భీమవరం, కోటిపల్లి, వాడాడ, కోడూరు, ఆకులకట్ట, గొల్లాది గ్రామాల్లోని 16 మంది రైతులకు చెందిన 14 ఎకరాల్లో జీడిమామిడి, కొబ్బరి తోటలను పెంచుతున్నట్లు పేర్కొన్నారు. వాడాడ జిల్లా పరిషత్ పాఠశాలలో ఇనిస్టిట్యూషనల్ ప్లాంటేషన్, లక్ష్మీపురంలో చేపలచెరువు గట్టుపై మొక్కలు నాటేందుకు ప్రాధాన్యమిస్తున్నామన్నారు. అలాగే గొల్లాది నుంచి భీమవరం, ముగడ, పాల్తేరు అప్పలనాయుడు చెరువు వరకు వేగావతి నుంచి వచ్చే సాగునీటి కాలువను బాగుచేసే పనులు చేపడుతున్నామన్నారు.

ఎండీయూ వాహనాల ద్వారానే రేషన్ పంపిణీ

తెర్లాం: రేషన్‌షాపుల డీలర్లంతా తెర్లాంలోని ఎంఎల్ఎస్ పాయింట్ నుంచి రేషన్ సరుకులు తూనిక వేయించి, రేషన్ డిపోలకు తీసుకువెళ్లాలని తహసీల్దార్ రాజేశ్వరి సూచించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సీఎస్‌డీటీ స్వర్ణలత ఆధ్వర్యంలో మండల రేషన్ డీలర్ల సమావేశం శుక్రవారం నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ జూలై నెలకు సంబంధించిన రేషన్ బియ్యం ఎండీయూ వాహనాల ద్వారానే పంపిణీ చేయడం జరుగుతుందని, ఎండీయూ వాహనాలకు అందించాల్సిన బియ్యం ఎంఎల్ఎస్ పాయింట్ నుంచి తూనిక వేసి రేషన్ డిపోలకు తీసుకువెళ్లాలన్నారు. అక్కడి నుంచి బియ్యం ఎండీయూ వాహనాలకు డీలర్లు అందజేయాలన్నారు. జూలైలో బియ్యం మాత్రమే పంపిణీ చేస్తారని, పంచదార, కందిపప్పు వంటి సరుకులు ఇంతవరకు రాలేదన్నారు. ఎండీయూ వాహనదారులు కూడా రేషన్ సరుకులు సక్రమంగా పంపిణీ చేసేలా డీలర్లు చూడాలని ఆమె కోరారు. సమావేశంలో మండల డీలర్ల సంఘం అధ్యక్షుడు తెంటు సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న తహసీల్దార్ రాజేశ్వరి

ఇంటికి వెళ్లి, పింఛన్ ఇవ్వండి

- సచివాలయ సిబ్బందికి ఎంపీడీవోల ఆదేశాలు

బొబ్బిలి రూరల్: పింఛన్ల పంపిణీ సక్రమంగా జరిగేలా చర్యలు తీసుకుంటున్నామని ఎంపీడీవో పి.రవికుమార్ తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం విలేకరులతో మాట్లాడిన ఆయన.. జూలై 1వ తేదీనే పింఛన్ల పంపిణీ జరుగుతుందని, దీనికోసం సచివాలయ సిబ్బందికి బాధ్యతలు అప్పగించామన్నారు. మండలంలోని 33 పంచాయతీల్లో 22 గ్రామ సచివాలయాలు ఉండగా, ఒక్కో ఉద్యోగి 60 మంది లబ్ధిదారులకు పింఛన్లు అందించేలా సూచనలు చేశామన్నారు. ఉదయం 6 గంటల నుంచే పెన్షన్లు అందివ్వడం జరుగుతుందన్నారు.


తెర్లాం: మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్లతో ఎంపీడీవో బి.మధుసూదనరావు శుక్రవారం సమావేశమై, పింఛన్ల పంపిణీపై సూచనలు చేశారు. సచివాలయ ఉద్యోగులకు క్లస్టర్ల వారీగా మ్యాపింగ్ చేయడం జరుగుతుందని, ఆయా క్లస్టర్ల పరిధిలోని లబ్ధిదారులకు జూలై 1న ఉదయం 6 గంటలకే పింఛన్ అందజేయాలన్నారు. పెన్షన్ల పంపిణీలో ఎటువంటి జాప్యం జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. సచివాలయ ఉద్యోగులు సరిపోని పక్షంలో ఇతర శాఖలకు సంబంధించిన ఉద్యోగులకు కూడా బాధ్యతలు అప్పగించడం జరుగుతుందన్నారు. పంచాయతీ కార్యదర్శులంతా పెన్షన్ల పంపిణీ కార్యక్రమం సజావుగా జరిగేలా పర్యవేక్షణ చేయాలన్నారు. సమావేశంలో ఎంపీడీవో కార్యాలయ ఏవో అప్పారావు తదితరులు పాల్గొన్నారు.



తెర్లాం: మాట్లాడుతున్న ఎంపీడీవో మధుసూదనరావు

బాడంగి: మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులతో ఎంపీడీవో ఆంజనేయులు శుక్రవారం సమావేశమై, పింఛన్ల పంపిణీకి సంబంధించి, ప్రభుత్వం జారీ చేసిన ఆదేశాలను తెలిపారు. సచివాలయ ఉద్యోగులంతా లబ్ధిదారుల ఇంటింటికీ వెళ్లి, వారికి పింఛన్లు అందజేయాలన్నారు. క్లస్టర్‌ల వారీగా ఒక్కో ఉద్యోగి ద్వారా 70 పింఛన్లకు మించకుండా మ్యాపింగ్ చేసుకోవాలన్నారు. బ్యాంకుల నుంచి నగదు విత్‌డ్రా చేసుకోవాలన్నారు. పింఛన్ల పంపిణీని తహసీల్దార్, ఈవోపీఆర్‌డీలు పర్యవేక్షిస్తారన్నారు. సమావేశంలో ఏవో మురళి, పీఆర్ ఏఈ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

రాజాం సిటీ: మండలంలోని అన్ని పంచాయతీల్లో జూలై నెలకు సంబంధించిన పింఛన్లు ఒకటో తేదీనే పంపిణీ చేయాలని ఎంపీడీవో వి.శ్రీనివాసరావు తెలిపారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ వెల్ఫేర్, ఎడ్యుకేషన్ అసిస్టెంట్‌లతో పింఛన్ల పంపిణీపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో 7,957 మంది పింఛన్‌దారులు ఉన్నారని, వారందరికీ క్లస్టర్ వారీగా మ్యాపింగ్ చేసిన సచివాలయ సిబ్బంది ద్వారా జూలై 1వ తేదీ ఉదయం 6 గంటల నుంచే డోర్ టూ డోర్ పింఛన్‌ల పంపిణీ ప్రారంభించి, సాయంత్రానికి శతశాతం పూర్తి చేయాలన్నారు.



బాడంగి: పింఛన్ల పంపిణీపై సూచనలిస్తున్న ఎంపీడీవో ఆంజనేయులు

రాజాం: మున్సిపాలిటీ పరిధిలోని 24 వార్డులకు సంబంధించి, 11 సచివాలయాల ఉద్యోగుల ద్వారా జూలై నెల పింఛన్లు పంపిణీ చేయడం జరుగుతుందని మున్సిపల్ కమిషనర్ జె.రామప్పలనాయుడు శుక్రవారం తెలిపారు. ఈ మేరకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశామన్నారు. మున్సిపాలిటీలో మొత్తం 4,193 మంది లబ్ధిదారులకు నేరుగా పింఛన్ అందిస్తామని, వార్డు సచివాలయ అడ్మినిస్ట్రేటర్లతో పాటు ఉద్యోగులు ఈ పంపిణీ కార్యక్రమంలో పాల్గొంటారన్నారు.